# ఏనుగుల దాడిలో వరి పంటకు నష్టం

-చంద్రగిరికి కూతవేటు దూరంలో ఘటన

చంద్రగిరి, జూలై 29 ప్రభాతవార్త: ఏనుగుల దాడి మరోసారి రైతులతో పాటు ప్రజలను భయాంధోళనకు గురి చేస్తున్నది. మండల పరిధిలోని చంద్రగిరికి కూతవేటు దూరంలోని మిట్టపాళ్యం వద్దగల కల్లేటి వంక పరిసరాలలోని వరిపంటలోకి సోమవారం సాయంత్రానికే 11 ఏనుగులు గుంపుగా వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోనికి తరిమివేసే ప్రయత్నాలు చేశారు. అయితే కొంత సమయానికి తిరిగి ఆనంద నాయుడు మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు సుమారు 30 అరటి చెట్లను ఆరగించాయి. అక్కడి నుండి నరశింగాపురంకు చెందిన రాజసులోచన అనే మహిళా రైతు తన 1.40 ఎకరాలలో పండిస్తున్న వరి పంటను ఏనుగులు పూర్తిగా తొక్కుకుంటూ నష్టపరిచాయి. వాస్తవానికి ఏనుగులు రాక గత ఐదారు సంవత్సరాలుగా ఎక్కువ అవుతున్నది. అయితే అడవిలో ఏనుగులకు ఆహారం కొరత కారణంగా గ్రామాల వైపు వస్తున్నాయా, రైతులు పండించే పంటల రుచిని గమనించి పదేపదే వస్తున్నాయా అనే కోణంలో ఆలోచించి శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి వున్నది. ప్రస్తుతం నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన



బాధ్యత అటవీశాఖ అధికారులపై వున్నది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# రాష్ట్రానికి ఆదర్శంగా జిల్లా డ్వాక్రా సంఘాలు

- డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి



జిల్లా మహిళా సమాఖ్య సమావేశం

చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త: జిల్లాలోని డ్వాక్రా సంఘాలు రాష్ట్రానికి ఆదర్శం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పిలుపు నిచ్చారు. జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో మంగళవారం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీళ అధ్యక్షతన జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా జిల్లా సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈజీ మార్ట్‌ల నిర్వహణలో జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, ఇదే తరహాలో సంఘాల సభ్యులు అన్ని పథకాలను సద్వినియోగం చేసుకుని చిత్తూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. అలాగే రుణాల రికవరీపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే వెదురు, మునగ సాగుకు ప్రత్యేక రాయితీ సదుపాయం వుందని ఈ అవకాశంను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునగ పంట ఉత్పత్తుల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, తద్వారా సంఘ సభ్యులు మునగ ఆకు తదితర ఉత్పత్తులను యూనిట్ వద్దకు సకాలంలో తీసుకువస్తే దానికి అనుగుణంగా ధరలు చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే మహిళా సభ్యులకు డ్రోన్‌లను రాయితీతో అందించడం జరుగుతుందని, జిల్లాకు 8 డ్రోన్ యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. చదువుకుని సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన వున్న సంఘ సభ్యులకు వీటిని సబ్సిడీ ధరలకు అందించడం జరుగుతుందన్నారు. అలాగే అరకు కాఫీ యూనిట్లు, కిచెన్ గార్డెన్లు, కోళ్ళ పెంపకం వంటి యూనిట్లకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే సిఎం సూర్యఘర్ పథకం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి గ్రామీణ మహిళలు ఈ పథకంను వినియోగించుకునే విధంగా కృషి చేయాలన్నారు. నెక్ ఆర్థిక సహాయంతో జిల్లాకు 40 ఎగ్‌మార్ట్‌ను కేటాయించడం జరిగిందని, ఇందులో ప్రస్తుతం 10 యూనిట్లు జిల్లాకు వచ్చాయన్నారు. ఈ యూనిట్లను అత్యంత పేదరికంలో వున్న వారికి ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘ సభ్యులు పరిస్థితులకు అనుగుణంగా కొత్త తరహా వ్యాపార కార్యక్రమం ఎంచుకుని నిర్వహించాలని, అప్పుడే కొంత వరకు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం వుంటుందన్నారు. ఈ సమావేశంలో డిపిఎంలు రవికుమార్, సునీతా లక్ష్మీ, ఎపిఎంలు సుబ్బారెడ్డి, మధు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

- అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు త్వరలోనే శంకుస్థాపన - ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ ప్రారంభోత్సవంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు



తిరుపతి క్రీడ, జూలై 29 ప్రభాతవార్త: ఆనాడైనా ఈనాడైనా క్రీడల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు కట్టుబడి పనిచేస్తున్నారని, ఆయన నేతృత్వంలో క్రీడల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చిత్తూరు డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2025 (సీనియర్ మెన్ అండ్ ఉమెన్) పోటీలను మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలుత పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో బ్యాడ్మింటన్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయుడు మొదటి నుంచి క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. త్వరలోనే అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని వివరించారు. టీటీడీ, శాప్ నిధులతో ఆనాడే శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సును ఆయన నిర్మించారన్నారు. ఏపీ నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేయాలనే సంకల్పంతో అంతర్జాతీయ క్రీడాకారులకు స్థలాలనిచ్చి అకాడమీల స్థాపనలకు కృషి చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడని కొనియాడారు. గత ముప్పై ఏళ్లుగా బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఫెడరేషన్లు సమర్థవంతంగా పనిచేస్తూ బ్యాడ్మింటన్ క్రీడను ముందుకు తీసుకెళ్లడం ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ క్రీడా సదుపాయాల కల్పనకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. అత్యుత్తమ క్రీడా విధానాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. అనంతరం తిరుపతి నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మ మాట్లాడుతూ ఏపీలో క్రీడాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లు అపారమైన కృషి చేస్తున్నారన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడాసదుపాయాలు, క్రీడా ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా క్రీడాంధ్రప్రదేశ్ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ శశి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళల ప్రయాణాలు,బస్సులడేటాపై సమగ్ర నివేదికలు

- ఆర్టీసి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



తిరుపతిరవాణ,జూలై 29ప్రభాతవార్త: ఆగస్ట్ 15నుండి అమలవుతున్న మహిళల ఉచిత బస్సు పథకం పక్కాగా నిర్వహించాలని, చిన్నపాటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆర్టీసి అధికారులను రాష్ట్రరవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం రాయలసీమజిల్లాల పరిధిలో ఆర్టీసి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా చేపట్టేలా సిఎం చంద్రబాబునాయుడు శ్రద్ధచూపుతున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ,వారికోసం బస్సులు సకాలంలో నడపడంపై ఆర్టీసి అధికారులు తీసుకోవాల్సిన ఏర్పాట్లుపై మంగళవారం తిరుపతిలోని సంస్కృత యూనివర్సిటీలో సమావేశం జరిగింది. రవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసి ఎండి ద్వారకాతిరుమలరావు, కడప జోనల్ ఛైర్మన్ పూలనాగరాజు, తిరుపతి జిల్లాప్రజారవాణా అధికారి జగదీశ్ పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. ఆర్టీసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏపిఎస్ఆర్టీసి ప్రధాన కార్యాలయం నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ ఎ.అప్పలరాజు, టి.చంగల్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, ఎనిమిది జిల్లాల ప్రజారవాణా అదికారులు,డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

# స్కిట్ కళాశాల మనుగడకు మూడేళ్ళు ప్రభుత్వ ఆర్థిక చేయూత

రూ.120 కోట్లు మంజూరుకు నిర్ణయం

శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త :శ్రీకాళహస్తీశ్వరాలయం పర్యవేక్షణలో సుమారు 20 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించి మూతపడ్డ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి సన్నాహాలు జరుగుతు న్నాయి. ఈ నేపధ్యంలో మంగళవారం అనంతపురం జేయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు వారి సిబ్బంది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్థానిక దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. రెండవ కౌన్సి లింగ్‌లో సీట్లు కేటాయింపుకు అనుమతించారు. కళాశాల పునః ప్రారంభానికి ప్రభుత్వం రూ.120కోట్లు మంజూరుకు అనుమతిం చింది. శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో సుమారు 20సంవత్సరాల పాటు సమర్థవంతంగా నిర్వహించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల 2021లో పూర్తిగా మూత పడింది. ఐదేళ్ళ పాటు రాష్ట్రాన్ని, శ్రీకాళహస్తిని పరిపాలించిన వైకాపా నాయకులు ఈ కళాశాల నిర్వహణ,పర్యవేక్షణను గాలికి వదలిపెట్టారు. ఇక్కడ పని చేసే ఉద్యోగులకు ఐదేళ్ళ పాటు ఆర్థికంగా భరించిన దేవాదాయశాఖ చేతులెత్తేయటంతో మూత పడింది. ఇక్కడ పని చేసిన ఉద్యోగులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు.ఈ దుస్థితిని గమనించిన 2022లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నాయకుడు నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే స్కిట్ కళాశాలను పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన తరువాత స్థానికంగా తెలుగుదేశం శాసనసభ్యుడుగా గెలిచిన బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పట్టుబట్టారు. అయితే ఈ ఇంజనీరింగ్ కళాశాలను అనంతపురం జేయన్‌టియుకి లీజుకు ఇవ్వాలని 2014-19లో ప్రతిపాదించారు.నిబంధనలలో ఒప్పందం కుదరలేదు. దాంతో మూత దిశగా అడుగులేసింది.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ,వైస్ ఛాన్సలర్

**అనంత జేయున్‌టియులో విలీనం:**

శ్రీకాళహస్తీశ్వరాలయం సుమారు 25 సంవత్సరాల పాటు నిర్వహించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం అన్ని కోణాల నుంచి పరిశీలించిన తరువాత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ దేవాదాయశాఖ నిధులు కాకుండా మూడేళ్ళ పాటు ప్రభుత్వమే భరించేటట్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళ వారం జేయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, ఎంఎల్ఏ సుదీర్‌రెడ్డి, ఆలయ ఇఒ డి.బాపిరెడ్డిలతో కలసి కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. గత 10రోజులుగా ఇక్కడ జేయన్‌టియు మరమ్మతులను చేపట్టారు.ఈ పనులు ఎలా జరుగుతున్నాయనే అంశాన్ని ఇరువురు కలసి పరిశీలించారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించారు. ఆగస్టు 4 నుంచి కళాశాలను ప్రారంభించనున్నట్లు ఇప్పటికే శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రకటించారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ మొదట తాము మూడేళ్ళ పాటు ఆర్థికంగా దేవాదాయశాఖ నుంచి అందించాలని ప్రతిపాదించారన్నారు. అయితే ఈ ప్రాంతం పట్ల గుర్తింపు ఉన్న ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు ఆర్థిక భారం దేవాదాయశాఖ మీద ఉండకూడదని ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించి ఉత్తర్వులు ఇవ్వటం వారికి ఎలా ధన్యవాదాలు తెలపాలో అర్థం కావటం లేదని సుధీర్‌రెడ్డి వివరించారు. ప్రభుత్వం మూడేళ్ళ పాటు ఆర్థిక సహాయం అదిస్తుంది. ఏటా రూ.40కోట్లు చొప్పున అందించుటకు నిర్ణయించారు. కళాశాల ప్రారంభోత్స వానికి జేయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒ డి.బాపిరెడ్డిల సహాకారం ఎంత చెప్పినా తక్కువే అని సుధీర్‌రెడ్డి ప్రశంసించారు.

# ప్రకృతి వైపరిత్యాల శోధనకే నిసార్ ప్రయోగం

- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

-అమ్మణ్ణి సేవలో ఇస్రో ఛైర్మన్

సూళ్లూరుపేట, జులై 29 ప్రభాతవార్త : ప్రకృతి వైపరిత్యాలను ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రస్తుతం ప్రయోగించనున్న నిసార్ ఉపగ్రహం ఎంతో విలువైనదని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ వెల్లడిం చారు. శ్రీచెంగాళమాత పరమేశ్వరిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేఖ రులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రయోగం ఎంతో ముఖ్యమైనదని, ఇస్రో, నాసా కలిసి సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు ఆయన చెప్పారు. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు శ్రీహరికోటలోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం ఉంటుందన్నారు. పిఎస్ఎల్వి-సి61 విఫలం తర్వాత జరుగుతున్న ప్రయోగం కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా ప్రకృతి వైపరిత్యాలైన తుపాను, సునామి, భూకంపాలు, మంచు పర్వతాల కదలికలతో పాటు మరెన్నో ప్రకృతికి సంబంధించిన అంశాలపై సమాచారాన్ని ఈ ఉపగ్రహం అందిస్తుందన్నారు. త్రీడీ చిత్రాలను స్పష్టమైన త్రీడీ చిత్రాలు ఇవ్వడం దీని ప్రత్యేకతగా చెప్పారు. నిసార్ ఉపగ్రహాన్ని రోదశీలోకి ప్రవేశపెట్టే జిఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్‌కు సంబంధించి కౌంట్‌డౌన్ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల 10 నిమిషాల నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. అమ్మణ్ణి ఆశీస్సులతో ఈ ప్రయోగం విజయవంతం కావాలని ప్రార్థించినట్లు నారాయణన్ చెప్పారు. ఈ సమావేశంలో విఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్ని కృష్ణన్, ఎస్‌డిఎస్‌సి మేనేజర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మణ్ణి సేవలో ఇస్రో ఛైర్మన్:**

శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. శ్రీహరికోటలో ప్రయోగం జరిగే ప్రక్రియలో శ్రీచెంగాళమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా



విలేఖరులతో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్

కొనసాగుతోంది. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అమ్మణ్ణిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఇస్రో ఛైర్మన్ దంపతులకు దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, కొండలరావు, రాజశేఖర్, గోపి, కె.పెంచలయ్య తదితరులు ఉన్నారు.

# అరెస్ట్‌లో జాప్యంపై...ప్రజా సంఘాల ఆందోళన తప్పదు

కోట,జూలై 29 ప్రభాతవార్త : కోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పిఇడి మాస్టార్ మాబాష ను కేవలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కానీ అరెస్ట్‌లో జాప్యం చేస్తున్నారని రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యులు పనబాక కోటీశ్వరరావు ఆరోపించారు.కోటలో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అరెస్ట్‌లో జాప్యం జరగడంతో తమకు పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. వసతి గృహం విద్యార్థులు ఆధారాలుతో సహ పోలీసులకు పిర్యాదు చేశారని ఆయన గుర్తు చేశారు. విద్యాశాఖ స్పందించి పిఇటి సస్పెన్స్ చేసిందన్నారు. పోలీస్ స్టేషన్‌కే కూత వేట దూరంలో ఉన్న ఎస్‌సి బాలికల వసతి గృహం విద్యార్థులు పిఇటి చేతిలో దారుణంగా దెబ్బలు తింటే ఇంత నిర్లక్ష్యం వహిస్తారని ఆయన పోలీసుల తీరుపై మండి పడ్డారు. మరో పక్క దళిత ప్రజాసంఘాల వచ్చి వసతి గృహంలో బాధితులను పరామర్శించడం జరిగిందన్నారు. శాసన సభ్యులు డా.పాశిం సునిల్ కుమూర్ కూడా అక్కడేక్కడే పోలీసులకు సూచనలు చేసిన ఇంత వరకు మాబాషను అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్ధి సంఘాలు, మహజనా సంఘాలు, దళిత ,సంఘాలు అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఆందోళన చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పామంజి కృష్ణయ్య,కోట మండల భాజపా అధ్యక్షులు పి.సురేష్, వవెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాజపా నాయకులు పనబాక కోటీశ్వరరావు

**సిఐ వివరణ :**

పిఇటి మాస్టార్ అరెస్ట్‌లో పోలీసులు జాప్యం చేస్తున్నారనే భాజాపా నాయకుడు పనబాక కోటీశ్వరరావు ఆరోపణులపై వాకాడు సిఐ హెస్సెన్ భాషను ప్రభాతవార్త ఫోన్ లో వివరణ కోరగా స్కూల్‌లో జరిగిన సంఘటన కారణంగా కూడా లోత్తుగా విచారణ జరపాల్సి ఉందన్నారు. ఇప్పటికే విద్యాశాఖ అతనిని సస్పెన్స్ చేసిందన్నారు.అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరిపిన తరువాతపై అధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవడం జరుగుతందన్నారు. ప్రజా సంఘాలు కూడా కాస్తా సమన్వయం పాటించాల్సి ఉందన్నారు.

## ఆగస్టు 1నుంచి పేట ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తిరూరల్,జూలై 29 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయ 155 వ బ్రహ్మోత్సవాలను ఆగస్టు 1 నుంచి ప్రారంభమౌతాయని నిర్వాహకులు మంగళవారం వివరించారు. ఆగస్టు 1 శుక్రవారం రాత్రి అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమౌతాయని వివరించారు.ఈ ఉత్సవాలు ఆగస్టు 15 వరకు నిర్వహించబడుతుందని వివరించారు.10రోజుల పాటు నిద్యారాధనలు జరుగుతాయని తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 10ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఉత్సవాలను నిర్వహించుటకు మేకళత్తూరు పెద్దసుబ్రమణ్యం, వళత్తూరు బాలయ్య, దండా మాధవయ్య, తంబా సుబ్రమణ్యం వళత్తూరు త్యాగరాజ మొదలి, తంబా హరిమొదలి,మేకళత్తూరు మునస్వామి, దారకృష్ణ కటికం ప్రకాష్‌లను కమిటిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

# పీజీఆర్‌ఎస్‌లోనే ప్రజా సమస్యలకు చక్కని పరిష్కారం

- జిల్లాలో పీ-4 సర్వేను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జూలై 29 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లోనే ప్రజా సమస్యలకు చక్కని పరిష్కారం లభిస్తుందని, అలాగే జిల్లాలో పీ-4 సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, మండల అధికారులు తదితర అధికారులతో వర్చువల్‌గా పీజీఆర్ఎస్ సమస్యలపై అలాగే పీ-4 సర్వే, ఎన్టీఆర్ పెన్షన్లపై డైలీ వేజ్ వర్కర్లకు కనీస వేతనాల నిర్ణయం, నేలపట్టు ఎకో సెన్సిటివ్ జోన్ జోనల్ మాస్టర్ ప్లాన్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జేసీ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులతో కలిసి సమీక్ష నిర్వహించి, సకాలంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలన్నారు. అలాలే పాజిటివ్ పర్సెప్షన్ సంబంధించి విద్యుత్ సమస్యలు, ఇసుక, ఇసుక పాయింట్స్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గృహ నిర్మాణం నకు సంబంధించిన విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో డెప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోజ్‌మాండ్, అటవీశాఖ అధికారులు డీపీఓ సుశీలదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, డ్వామా పీడీ శ్రీనివాసరావు, డీఎంఅండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్.ఐ సురేంద్రనాయుడు, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి విక్రం కుమార్‌రెడ్డి, డీఈవో రవి కుమార్, ల్యాండ్ అండ్ సర్వ్ ఏడీ అరుణకుమార్, జిల్లా అధికారులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యరంగ అభివృద్ధిలో జీనోమిక్స్, కనెక్టోమిక్స్ కీలకపాత్ర

-కనెక్టోమిక్స్-2025 జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో అపోలో యూనివర్సిటీ విసి డాక్టర్ వినోద్‌భట్




కనెక్టోమిక్స్-2025 జాతీయ సదస్సులో మాట్లాడుతున్న అపోలో యూనివర్సిటీ విసి డాక్టర్ వినోద్‌భట్

చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త : భవిష్యత్ వైద్యరంగ అభివృద్ధిలో జీనోమిక్స్, కనెక్టోమిక్స్ కీలకపాత్ర పోషించనున్నాయని ది అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వినోద్‌భట్ అన్నారు. చిత్తూరు అపోలో వైద్య విజ్ఞాన పరిశోధన సంస్థ(ఎఐఎంఎస్ఆర్)లో శనివారం ఓమిక్స్, బయోఇన్‌ఫర్మేటిక్స్, డేటా సైన్స్‌ల సమన్వయంతో ఆధునిక వైద్య పరిశోధనలకు దోహదపడే కనెక్టోమిక్స్-2025 జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సును ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి వ్యక్తిగత వైద్యంకు దోహదపడే విధంగా ఈ సాంకేతికతలు వినియోగించాల్సిన అవసరం పెరిగిందన్నారు. రోగ నిరోధక శక్తిని పెంపే ఆరోగ్య రక్షణకు కీలకమని, వ్యాధులు ప్రబలడానికి ముందే జీనోమిక్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ వంటి విధానాలను ప్రజారోగ్యంలో భాగంగా చేయాల్సిన అవసరం వుందని ఆయన పేర్కొన్నారు. అపోలో నాలెడ్జ్ సిఇఓ శివరామకృష్ణన్ మాట్లాడుతూ డిజిటల్ హెల్త్ ప్రాధాన్యత పెరుగుతుందని, అపోలో ఈ రంగంలో కీలక అడుగు వేసిందన్నారు. అపోలో ఇప్పటికే లక్షలాది జీవితాలను ప్రభావితం చేసిందని, ఇకపై ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేయడానికి సంస్థ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ పోతురాజు, అపోలో హాస్పిటల్స్ పరిశోధన, ఆవిష్కరణల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రవి మహాజన్, ఐసిఎమ్మార్ శాస్త్రవేత్తలు డాక్టర్ సురుచి అగర్వాల్, డాక్టర్ ప్రియాంక నారద్, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ ఆల్ఫ్రేడ్ జె.అగస్టిన్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఉషా ఆడిగా, దేశ వ్యాప్తంగా వున్న వైద్య, బయోటెక్నాలజీ, డేటా సైన్స్ రంగాల నుండి వచ్చిన నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

**జాతీయ స్థాయిలో విశిష్టం:**

దేశవ్యాప్తంగా వున ప్రముఖ మెడికల్, బయోటెక్, డేటా సైన్స్ రంగాల నిపుణులు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొంటున్నారు. సాంకేతికత ఆధారంగా ప్రజారోగ్య రంగంను బలోపేతం చేయడం, వైద్య పరిశోధనలో నూతన మార్గాల ఆన్వేషణ ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఎఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఉషా ఆడిగా పేర్కొన్నారు. విద్యార్థులు, యువ పరిశోధకుల కోసం పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజారోగ్యంలో సాంకేతిక విజ్ఞానం వల్ల అవగాహన పెంప, పరిశోధనల మార్గాలను చర్చించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం అని అమె పేర్కొన్నారు.

## నలుగురు ఇన్స్‌పెక్టర్లు బదిలీ

**చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో నాలుగు పోలీస్ స్టేషన్ సర్కిళ్ళకు నలుగురు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లను అటాచ్డ్ చేస్తూ ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నిత్యబాబును చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా అటాచ్డ్ చేయగా, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ చేశారు. అలాగే విఆర్‌లో వున్న ఇన్స్‌పెక్టర్ కె.లక్ష్మీనారాయణను చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా, ఇది వరకు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం చిత్తూరు వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మహేశ్వర్‌ను మళ్ళీ వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా అటాచ్డ్ చేస్తూ ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వులు జారీ చేశారు.

## పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ



**చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. ఎపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికి సంబంధించి ప్రొసిడింగ్స్ జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి కాళేశ్వర్‌రెడ్డి, జిల్లా ఎపిడబ్ల్యుయుజె అధ్యక్షుడు లోకనాథం, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు శివకుమార్, నాయకులు అశోక్‌కుమార్, సభ్యులు తదితరులు వున్నారు.

## విద్యుత్ ఛార్జీలు సకాలంలో చెల్లింపు : ఎస్ఇ



**చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:** వినియోగదారులు విద్యుత్ ఛార్జీలను సకాలంలో చెల్లించాలని విద్యుత్‌శాఖ ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. స్థానిక ట్రాన్స్‌కో ఇంజనీర్ కార్యాలయంలో మంగళవారం ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ విద్యుత్ బిల్లుల చెల్లింపు, విద్యుత్ సరఫరా తదితరాలపై ట్రాన్స్‌కో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ మాట్లాడుతూ సిబ్బంది ఎప్పటికప్పుడు విద్యుత్ ఛార్జీలు వసూలు చేయాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీల విద్యుత్ సర్వీసులను పరిశీలించి ఎవరైతే 200 యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించి వున్నారో అలాంటి వారి నుండి అదనంగా వినియోగించిన యూనిట్ల ఛార్జీలు వసూలు చేయాలన్నారు. అలాగే వ్యవసాయ సర్వీసుల బకాయిలను సైతం వసూలు చేయాలని, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులను పక్కాగా వుంచుకోవాలని ట్రాన్స్‌కో ఎఇ తులసీప్రసాద్‌ను ఎస్ఇ ఆదేశించారు. ఈ సమావేశంలో జిడినెల్లూరు ఎడిఇ శేషాద్రిరెడ్డి, పెనుమూరు ఎఇ తులసీప్రసాద్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సికె లావణ్య ప్రత్యేక పూజలు



చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త: చిత్తూరు పొన్నియమ్మన్ గుడిలో శ్రావణ మాసం, నాగపంచమి పురస్కరించుకుని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకులు సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం, నాగపంచమి పురస్కరించుకుని సికె లావణ్య పొన్నియమ్మన్ వారికి మహా కుంభని వేదనను సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆవరణలో సికె లావణ్యబాబు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు

## సచివాలయం సిబ్బందికి సన్మానం



**కల్లూరు, జులై 29 ప్రభాతవార్త:** కావేటిగారిపల్లి గ్రామ సచివాలయం నుంచి బదిలీ అయిన సిబ్బందికి మంగళవారం టిడిపి నాయకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు మంచి విందు భోజనం ఇచ్చారు. అలాగే సచివాలయంలో కొత్తగా జాయిన్ అయినా సిబ్బందికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అరుణాచలం నాయుడు, ధనుంజయ నాయుడు, పరంధామ నాయుడు, లోకేష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ

**పూతలపట్టు, జులై 29 ప్రభాతవార్త:** మండలంలోని పి. కొత్తకోట ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని గంగాధర నెల్లూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారిని షకీలా ఆకస్మికతనికి చేసి గణనీయంగా పెరిగిన విద్యార్థులతో పరిచయం చేసుకుని పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్న సిబ్బందిని అభినందిస్తూ వసతి గృహానికి రోజురోజు అభివృద్ధి పథంలో తీసుకుని వెళుతున్న వసతి గృహ సంక్షేమ అధికారి జయ చంద్రారెడ్డిని అభినందిస్తూ తమ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క వసతి గృహం పి.కొత్తకోట వసతి గృహాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వి.కోట, జులై 29 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవనంలో సీజనల్ వ్యాధులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఈశ్వరన్, పిహెచ్‌సి డా॥ మాధవి, ఇఒపిఆర్‌డి షేక్‌షావలీ, సర్పంచులు, కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన



**శాంతిపురం, జులై 29 ప్రభాతవార్త :** మండలంలోని 64 పెద్దూరు గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కొంతమంది మహిళలు గ్రామంలో రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో దిగువ ప్రాంతంలో నివాసం ఉన్న వారికి నీరు అందడం లేదని పేర్కొన్నారు.ఈ సమస్య విషయంగా పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని ఆరోపించారు. మహిళల నిరసనతో కొ ంతసేపు ఆ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక నేతలు సమస్య పరిష్కారంకు హామీ ఇవ్వడంతో మహిళలు వెనుతిరిగారు.

## కలెక్టర్‌చే ఐరాల పిహెచ్‌సి అకస్మిక తనిఖీ

ఐరాల, జులై 29 ప్రభాతవార్త: ఐరాల ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ ఓవర్ డీహైడ్రేషన్ డే సందర్భంగా కలెక్టర్ ఐరాల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్‌రెడ్డప్ప ఆధ్వర్యంలో కలెక్టర్ ద్వారా ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే కలెక్టర్ ఆసుపత్రిలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్పతో పాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఊరేగిన పాలేటి గంగమ్మ



**సోమల, జులై 29 ప్రభాతవార్త:** పాలేటి గంగమ్మ ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు కందూరు పంచాయతీ పగడాల వారి పల్లి, తప్పన్న గారి పల్లిలలో అమ్మవారు ఊరేగింపుగా వెళ్లారు. ఆనవాయితీగా అమ్మవారు ఈ గ్రామాల్లో ఉత్సవాల సమయంలో పర్యటించే ఆచారం ఉంది. ఈ సందర్భంగా గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సాకే బండ నరసింహులు కార్యక్రమాన్ని పర్యవేషించారు. మంగళవారం రాత్రికి సోమల చేరుకొని అమ్మవారు అక్కడ ఆరోజు కొలువు తిడతారని ఆయన తెలిపారు.

## కాలపరిమితి రద్దు చేయాలి



**సోమల, జులై 29 ప్రభాతవార్త:** వి ఏ ఓల కాల పరిమితి మూడు సంవత్సరాలు నిధించడం సరికాదని సిఐటియు నాయకులు వాడ గంగరాజు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సంఘమిత్ర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ మిత్రలపై రాజకీయ కక్షలు తగవని ఆయన హితవు పలికారు. సంఘమిత్ర జీతాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## కుప్పం పట్టురైతులు మైసూరుకు విజ్ఞానయాత్ర



**కుప్పం, జులై 29 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంత పట్టు రైతులు రెండు రోజుల పాటు కర్ణాటకలోని మైసూరు, మండ్య ప్రాంతాల్లో విజ్ఞానయాత్రకు బయల్దేరారు. మంగళవారం రైతుల బస్సును ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ప్రాంతం పట్టుసాగులో ఎంతో పేరు తెచ్చుకున్న ప్రాంతం అన్నారు. పట్టుసాగుతో రైతులకు లాభాలు కలుగుతాయన్నారు. అయితే సం ప్రదాయ రీతిలోనే కాకుండా పట్టుసాగులో వచ్చిన ఆధునిక టెక్నాలజీని రైతులు అవగతం చేసుకుంటే మరింత దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు రెండురోజుల పర్యటనలో పట్టుసాగుపై తగు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, విసి మంజునాథ్, పట్టుశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి : కమీషనర్



**కుప్పం, జులై 29 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలో ఉన్న అక్రమ లేఔట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం కుప్పం మున్సిపల్ కమీషనర్ తన ఛాంబర్‌లో ఎల్ఆర్ఎస్ పథకంపై రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జిఒ ఎంఎస్ నెం 134 ద్వారా ప్లాట్లు క్రమబద్ధీకరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. జూన్ 30 రిజిస్ట్రేషన్ అయినటువంటి ప్లాటు, ఎల్ఆర్ఎస్ పథకం ప్రారంభ తేది జులై 31 నుంచి 90రోజుల్లోపు ప్లాట్ యజమానులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫ్లాట్లు క్రమబద్ధీకరించుకుంటే భవన నిర్మాణ అనుమతులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సులభతరం అవుతుందన్నారు.

## పేదరికం లేని సమాజం కోసమే బంగారు కుటుంబాలు



**కుప్పం, జులై 29 ప్రభాతవార్త:** పేదరికం లేని సమావేశం కోసమే సిఎం చంద్రబాబు నాయుడు పి4కార్యక్రమంలో బంగారు కుటుంబాలను ప్రోత్సహిస్తారని మున్సిపల్ కౌన్సిలర్ జాకీర్ పేర్కొన్నారు. మంగళవారం సచివాలయం 3లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థిక, సామాజిక రంగాల్లో పైకి తీసుకొచ్చేలా ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జాను బాషా, విఆర్వో రాయుడు, అడ్మిన్ కార్యదర్శి కవిత, ప్రజలు పాల్గొన్నారు.

## తెదేపా సీనియర్ నేత మృతి.. నేతల నివాళులు



**కుప్పంరూరల్, జులై 29 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధి పరమసముద్రంకు చెందిన తెదేపా సీనియర్ నేత రాధాకృష్ణమూర్తి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు గ్రామానికి చేరుకుని రాధాకృష్ణమూర్తి మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబీకులకు మనోధైర్యం తెలియజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, ప్రతాప్ స్వామి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చిత్తూరును సర్వంగ సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి

- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు



**చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:** చిత్తూరు నగరంను సర్వంగ సుందరంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అన్నారు. చిత్తూరు నగరం 11వ డివిజన్ పరిధిలో పివికెఎన్ డిగ్రీ కళాశాల అటవీ మార్గంలో నిర్మించిన బిటి రోడ్డును మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , ఎమ్మెల్యేలు మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో దీర్ఘకాలికంగా పూర్తి కాని పివికెఎన్ డిగ్రీ కళాశాల అటవీ రహదారిని 4 కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి పూర్తి చేశామన్నారు. ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ సమస్య కొంత మేరకు తగ్గుతుందన్నారు. పివికెఎన్ డిగ్రీ కళాశాల అటవీ మార్గంలో గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి జయనిరాష్ పేరును పివికెఎన్ మార్గంకు పెట్టడం జరిగిందన్నారు. నగర పరిధిలో హైరోడ్డు- కట్టమంచి, ఇరువారం-దర్గా సర్కిల్, ఠాణా చెక్‌పోస్టు-గాంధీ విగ్రహం వరకు గల రోడ్లను వెడల్పు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఆముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత,

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

**చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:**

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 19 మంది ద్విచక్రవాహనదారులకు మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 1.90 లక్షల రూపాయలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు. చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 19 మంది ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారన్నారు. వీరిని మంగళవారం కోర్టుకు హాజరు పరచగా ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున మొత్తం 1.90 లక్షల రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా బదిలీ ఉద్యోగులకు సన్మానం



**వెదురుకుప్పం, జులై 29 ప్రభాతవార్త :** మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో బదిలీ పై వెళ్ళిన ఉద్యోగులకు ఘనంగా మంగళవారం సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపిడివో పురుషోత్తం పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని పనిచేసిన రోజులలో చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బట్టే రమణమ్మ, సర్పంచ్ శిరీష్, జిల్లా వైసీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు బట్టే సుబ్రమణ్యం, టిడిపి సీనియర్ నాయకులు బట్టే చాణిక్య ప్రతాప్, కార్యదర్శి బాలసుబ్రమణ్యం, విఆర్వో ధనశేఖర్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవీ ఆలయంలో నాగపంచమి వేడుకలు



**చౌడేపల్లి, జులై 29 ప్రభాతవార్త:** పుదిపట్ల స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో నాగపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారు, అభయాంజనేయస్వామి, నాగభైరవుకు ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అలంకరణ గావించారు. అధికంగా కుజ దోష పరిహారాలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించాడు. పలమనేరు మండలం ఏడూరుకు చెందిన వెంకట్రమణారెడ్డి, సుభద్రలు ఉభయదారులుగా వ్యవహరించారు.

## మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా వస్తాడు : వైకాపా



**చౌడేపల్లి, జులై 29 ప్రభాతవార్త :** పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి అన్నారు. లిక్కర్‌కేసులో అరెస్టు అయ్యి జైలులో వున్న రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి క్షేమం కోరుతూ వైకాపా నాయకులు పలు ఆలయాల్లో పూజలు చేసారు. మిద్దింటి శంకం నారాయణ, రుక్మిణమ్మ, పవన్‌రాయల్, హరీష్ రాయల్, ఠాణాదార్ నాగరాజ, షంషీర్, జంగాలపల్లి రమణ, రవిచంద్రారెడ్డి, అమరనాథ్, విజయ్ కుమార్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ



**పుంగనూరు రూరల్, జులై 29 ప్రభాతవార్త:**

సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహ విద్యార్థులకు అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని సకల సౌకర్యాలుతో ప్రభుత్వం చదివిస్తూందని, ట్రస్టు అండగా ఉంటుందన్నారు. హెచ్‌డబ్ల్యుఓ, కరణం రాజేష్ మాట్లాడుతూ హాస్టల్లో మంచినీరు కోసం ఆర్వో వాటర్ సౌకర్యం కల్పించాలని కోరారు.

## సమాచారం ఇవ్వని పౌర సమాచార అధికారి



**పూతలపట్టు, జులై 29, ప్రభాతవార:**

మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమాచార హక్కు చట్టం కింద అవగాహన సదస్సు జరిగిన లేదా ఎలాంటి సమాచారం కావాలని అడిగినా పౌర సమాచార అధికారి జాప్యం చేస్తున్నారు. మండల ప్రజలకు ఎలాంటి కావాలని కోరిన ఆ సమాచారం ఇవ్వకుండా అణగదొక్కడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య సమాచార హక్కు చట్టం 2025 పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయాలి

**సదుం, జులై 29 ప్రభాతవార్త:**



సదుం మండలంలో భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయాలని సదుం మండలం కురభ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సదుం గ్రామ పంచాయతీ ఆవరణలోని సంత ప్రదేశంలో కురవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త కనకదాస చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు మండలంలో ఎక్కువ మంది కురబలు ఉన్నారని అందరూ కలిసి విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కన్వీనర్‌గా వెంకటప్ప కో కన్వీనర్‌గా రెడ్డి కుమార్. వెంకట్ రమణ. మారాని వెంకట నారాయణ బాబు. రెడ్డప్ప, మల్లయ్య, కమిటీ సభ్యులుగా అమర్నాథ్,శీనువాసులు, బూరగ మంద సర్పంచ్ వెంకటరమణ, లైన్మెన్ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ కుమార్, బి. నారాయణ, నాగరాజు, కదిరప్ప, మెకానిక్ వెంకటరమణ, లక్ష్మినారాయన, పురుషోత్తం, ఈశ్వర, సహదేవ,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**సదుం, జులై 29 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పలు ఆలయాల్లో మంగళవారం గరుడ పంచమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలిగిరి మార్గంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలోనూ, కొత్తపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాగుల చవితి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల చేత పలు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## రామకృష్ణంరాజు కుటుంబాన్ని ఆదుకుంటాం



**సోమల, జులై 29 ప్రభాతవార్త:** ఆవులపల్లి పంచాయతీ కొత్తూరులో రెండు రోజుల క్రితం ఏనుగుల దాడిలో మృతి చెందిన రామకృష్ణంరాజు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని జనసేన నాయకులు తెలిపారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం మాట్లాడుతూ ఏనుగుల దాడిలో రామకృష్ణంరాజు మృతి చెందిన విషయం డిఎఫ్ఓ భరణి డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన పది లక్షల రూపాయలు పరిహారం అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బండారు రఘు. కోలా రామకృష్ణ. ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రభు, విజయ్ కుమార్, మురళి, చంగల్ రాయుడు, వినోద్, అభి, షబ్బీర్ భాష, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లిశెట్టిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు



**తవణంపల్లి, జులై 29 ప్రభాతవార్త:** మండలంలోని నల్లిశెట్టిపల్లి గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను పార్టీ ఆదేశాల మేరకు నల్లిశెట్టిపల్లి గ్రామంలో నిర్వహించారు. మండల టిడిపి నాయకులు దాముయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ తెల్లగుండ్లపల్లి మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.స్థానిక టిడిపి నాయకులు ఏకాంబరం నాయుడు, రైస్‌మిల్ బాలాజీ, చందు, ఢిల్లీబాబు, కమలాకర్, పరందామ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో 123వ మహా గురుపూజోత్సవం

**నారాయణవనం, జులై 29 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో



అవదూతగా భక్తుల మన్ననలను పొందుతున్న తాతా సొరకాయుల స్వామి మహాగురుపూజోత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం రాత్రి స్వామివారిని ట్రాక్టర్‌పై అధిరోహించి గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. మధ్యాహ్నం, రాత్రి స్థానికులకే కాకుండా ఇతర జిల్లాలు, తమిళనాడు నుంచి తరలివచ్చిన వందలాదిమంది భక్తులకు అన్నదానం అందించారు. మహా గురుజోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం జరిగిన కలశ పూజలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. స్వామి దర్శనం తర్వాత ఎమ్మెల్యేను దుశ్శాలువ, పూలమాలతో సత్కరిం చారు. ఆయనతో పాటు మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, మాజీ నెడ్ క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్, మాజీ సర్పంచ్ కెఎస్ రవి, నాయకులు ఊరప్ప, రమేష్, శంకరయ్య, నాగయ్య, కెజి లక్ష్మణన్, కె.సుధాబాబు, కుట్టి బాలయ్య, దేవరాజులు, మురళి, గుజ్జెలి మహేస్, పిజి ముఖేష్, డి.ఆరుముగం, ఎన్ రమేష్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రారంభమైన వీరభద్రుని బ్రహ్మోవాలు



నారాయణవనం, జులై 29 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ పరిధి చిత్రాంగికోటవీధి సముదాయం మార్గంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి మంగళవారం ఉదయం అంకురార్పణ నిర్వహించారు. రాత్రి స్వామి,అమ్మవారిని చంద్రప్రభవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఓ రవి, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, పూజారి అయ్యప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాధికారితే కూటమి ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే



**నారాయణవనం, జులై 29 ప్రభాతవార్త :** ప్రతి ఒక్క మహిళ ఆర్థిక సాధికారితను సాధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరనలోని వెలుగు కార్యక్రమంలో డ్వాక్ర మహిళలకు రుణాల అందించే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తత్సలం, ఎంపిడిఓ అరుణ, ఎపిఎం ధనంజయులురెడ్డి, సిసి నాగేంద్రరావు, నాయకులు ఊరప్ప, శంకరయ్య, రమేష్, కెజి లక్ష్మణన్, జి మహేష్, పిజి ముఖేష్, కుట్టి బాలయ్య, దేవరాజులు, మురళి, సుధాబాబు, కె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదిమూలంకు పదవీ పట్ల భారీ బైక్ ర్యాలీ



**నారాయణవనం , జులై 29 ప్రభాతవార్త :** సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎస్సీ సంక్షేమం అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమించడం పట్ల ఆయన అభిమానులు మంగళవారం ఉదయం స్థానిక చెన్నై జాతీయ రహదారిలోని అంబేద్కర కూడలి నుంచి నారాయణవనం టిటిడి అనుబంధ ఆలయం ఆంజనేయస్వామి ఆలయం వరకు భారీ స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200మంది వరకు ఆయన అభిమానలు పాల్గొన్నారు.

## వేడుకగా నాగపంచమి పూజలు



తిరుపతిరవాణ,జులై 29ప్రభాతవార్త: శ్రావణమాసం పవిత్రమైన మంగళవారం నాగపంచమి సందర్భంగా మహిళలు నాగాలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి అన్నమాచార్యకళామందిరంలోపల నాగాలమ్మలకు ప్రత్యేక అభిషేకం చేశారు. ప్రసాద నివేదనలు చేసి భక్తులకు పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో సురేశ్‌స్వామి, గుండాలగోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, చంగారెడ్డి, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కల్యాణి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

## పంచమితిథిన వరసిద్ధి వినాయకునికి అభిషేకం



**తిరుపతిరవాణ,జులై 29ప్రభాతవార్త:** శ్రావణమాసం చతుర్థశిపంచమితిథిన మంగళవారం ఉదయం వినాయకసాగర్‌లోని వరసిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సురేశ్‌స్వామి, గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, చంగారెడ్డి, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కల్యాణి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

## శాంతి భద్రతల పరిరక్షణకు ఆకస్మిక తనిఖీలు

శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలో శాంతి భద్రతల పరిరక్షణకు శ్రీకాళహస్తి డివైయస్పి నరసింహామూర్తి, టూ టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డివారిసిబ్బందిపట్టణంలోని నాలుగువ ఞాడావీధుల్లోని లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీ చేసినట్లు వివరించారు. పుణ్యక్షేత్రంలోని నాలుగు మాడావీధుల్లో ఇటీవల వ్యభిచారం విచ్చల విడిగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, దాంతో రాత్రివేళల్లో గస్తీ పెంచామని డివైయస్పి నరసింహామూర్తి తెలిపారు. అత్యవసర పనుల మీద తిరిగే వారు ఆధారాలు పెట్టుకొని తిరగాలని ఆయన సూచించారు.

## శివయ్య సేవలో ఇస్రో చైర్మెన్ పూజలు

శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త:



శ్రీహరికోటలోని ఇస్రో నుంచి ఈ నెల 30 కొత్త ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. ఈ నేపధ్యంలో మంగళవారం ఇస్రో చైర్మెన్ నారాయణ కుటుంబం వారి సిబ్బందితో శివయ్య సేవకు వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఒ మోహన్, పిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు.స్వామిఅ మ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.ఈ సందర్బంగా చైర్మెన్ నారాయణన్ మాట్లాడుతూ శ్రీహరికోట నుంచి చేపడుతున్న ప్రయోగాలు శివయ్య ఆశీస్సులతో విజయం సాధిస్తున్నామని వివరించారు.

## పరశురామేశ్వరుని సేవలో మంత్రి

శ్రీకాళహస్తిరూరల్,జూలై 29 ప్రభాతవార్త:



ఏర్పేడుమండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని సేవలో మంగళవారం టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఇఓ రామచంద్రారెడ్డి వేదపండితులతో స్వాగతం పలికారు. ఈసందర్బంగా మాజీ చైర్మెన్ గిరినాయుడుఓ వినతి పత్రం అందిస్తూ తిరుపతి,శ్రీకాళహస్తిలకు సమీపంలో ఉన్న పరశురామేశ్వరాలయానికి నేడు చక్కటి రోడ్డు సదుపాయం ఉంది కాబట్టి ప్రత్యేక ప్యాకేజీలుగా టూరిజం బస్సులను గుడిమల్లంకు పంపి ఈదివ్యక్షేత్ర ప్రాశస్త్యాన్ని దిశ దేశలా వ్యాపించేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి తిరుపతి నుంచి ప్యాకేజీలను అనుమతిస్తామని మంత్రి భరో ఇచ్చారు.

## ఓపెన్ బూజింగ్

శ్రీకాళహస్తిరూరల్,జూలై 29 ప్రభాతవార్త:



ఏర్పేడుమండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సిఐ శ్రీకాంత్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఇటీవల పలు ఆరోపణలు చోటు చేసుకున్నాయని విచ్చల విడిగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం,పేకాటలు లాంటి కార్యక్రమా లతో వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నారని వివరించారు. మండలకేంద్రంలో బ్యాంకుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామన్నారు. ఇక నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు సిఐ శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

## విద్యార్థులకు వాల్‌చాట్ పంపిణి

శ్రీకాళహస్తి జూలై 29 ప్రభాతవార్త:



పట్టణంలోని 16వ వార్డులో ఉన్న మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు వాల్‌చాట్స్‌ను కాంగ్రెస్ నాయకులు బత్తయ్యనాయుడు ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ చంద్రశేఖర్ యాదవ్‌కు పంపిణి చేశారు. పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి బత్తయ్యనాయుడు మాట్లాడు తూ నేటి బాలలే రేపటి పౌరులని పిల్లలందరూ బాగా చదువుకుని మంచి ఉద్యోగాలతో ముందుకు సాగాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కరీముల్లా, జిలానీబాషా, నాగురయ్య, శివయ్య,నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మతం పేరుతో అవమానించడం దారుణం : సిరాజ్‌బాషా

శ్రీకాళహస్తి జూలై 29 ప్రభాతవార్త:



నంద్యాల జిల్లా ఆత్మకూరు ఆర్‌టిసి డిపో డ్రైవర్ శ్రీశైలానికి విధి నిర్వహణ నిమిత్తం వెళ్లినపుడు ఆలయగేటు వద్ద టోపి తీస్తేనే అనుమతిస్తామని సెక్యూరిటి సిబ్బంది అడ్డుకోవడం వివాదస్పందంగా మారిందని వైకాపా సంయుక్త కార్యదర్శి షేక్.సిరాజ్ మంగళవారం అన్నారు. ఆయన మాట్లాడుతూ మతంతో సంబందం లేకుండా అన్నదమ్ముల కలిసి మెలిసి ఉన్న ఆంధ్రరాష్ట్రాన్ని కుల వివక్షతో చిచ్చురేపుతున్నారని ఈ కూటమి ప్రభుత్వం మరో ప్రభుత్వం మరో యుపి చేయాలని చూస్తుందన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

పుత్తూరు రూరల్, జూలై 29 ప్రభాతవార్త:

సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో పాశుపతాస్త్రం వంటిదని ఇన్‌చార్జి ఎంపీడీవో వాణి అన్నారు. 2005లో భారతప్రభుత్వం ప్రవేశపెట్టిన సమాచార హక్కు చట్టానికి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కొంత మంది స్వార్థపరులు సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేయడం దురదృష్టకరమని,ఇతర వక్తలు తమ ఆవేదనను తెలియజేశారు.

## పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రతానికి

రేపు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు



***తిరుచానూరు,జూలై 29ప్రభాతవార్త:*** శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్ట్ 8వతేదీ జరిగే వరలక్ష్మీవ్రతానికి సంబంధించి ఈనెల 31వతేదీ టిటిడి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విడుదలచేస్తుంది. పద్మావతిఅమ్మవారి ఆలయంలో జరిగే వరలక్ష్మీవ్రతంలో పాల్గొనే గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి 31వతేదీ ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో ఆలయం సమీపంలోని కౌంటర్‌లో ఆగస్ట్ 7వతేదీ ఉదయం 9గంట లకు కరెంట్‌బుకింగ్‌లో150 టిక్కెట్లు విక్రయిస్తారు. ఆరోజు ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రేక్‌దర్శనం, ఆశీర్వచనం సేవలు రద్దుచేసింది.

## అస్తవ్యస్తంగా మారిన సంక్షేమ హాస్టలు

తిరుపతి విద్య,జూలై 28 ప్రభాతవార్త :




సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించడం చేతగాని కూటమి ప్రభుత్వం వాస్తవాలు వెలుగు చూసి ఎక్కడ ప్రజాగ్రహం పెల్లుబుకుతుందోనన్న భయంతో తమ హాస్టళ్ల బాటకు ఆటంకం కలిగిస్తోందని వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఎస్.వి యూనివర్సిటీ అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ తమను హాస్టళ్లలోకి ప్రవేశించనీయకుండా తలుపులు మూయిం చేస్తుందని మండిపడ్డారు. లేకుంటే పోలీసు కేసులు నమోదు చేస్తామంటూ బెదిరిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ముని, మహేష్, హేమంత్,బోస్ ప్రణీదీప్,పవన్,సాయి, గౌతమ్,తదితరులు పాల్గొన్నారు.

---



బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన పోస్టర్ అడాప్షన్ గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ, తదతరులు

***తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త***

## దొంగతనాలు జరగకుండా సహకరించండి : డీఎస్పీ

రేణిగుంట, 29 ప్రభాతవార్త:



రేణిగుంట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకుల నందు దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పోలీసులతో సహకరించాలని రేణగుంట డిఎస్పి శ్రీనివాసరావు బ్యాంకు అధికారులకు పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని బ్యాంకులు అధికారులతో మంగళవారం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నందు డిఎస్పి శ్రీనివాసరావు పోలీసులను మమైకపరిచి బ్యాంకుల నందు నేరాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. ఇటీవల కాలంలో రాష్ట్రం లోనే కాక జిల్లాలో అనేక బ్యాంకులు,ఏటీఎంలో వద్ద దొంగతనాలు జరిగిన విషయాన్ని డిఎస్పి చర్చకు తీసుకొచ్చారు. ప్రతి బ్యాంకులో పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 100,112 లను డిస్ప్లే చేయాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, ఏర్పేడు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, రేణిగుంట పిఎస్ఐ స్వాతి, సబ్ డివిజన్ పరిధిలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బొజ్జల రిషితారెడ్డి సుడిగాలి పర్యటన

రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త:



పరిశుభ్రత లోనే ఆరోగ్యం దాగి ఉందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి అన్నారు. మంగళవారం రిషితా రెడ్డి రేణిగుంట పంచాయతీలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో పరిశుభ్రతలో భాగంగా తడి, పొడి చెత్త సేకరించే టబ్బులు, చెత్తను సేకరించి తోసుకెళ్లే బండ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తరువాత శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవస్థానంలో జరిగే జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అక్కడనుండి నేరుగా బీసీ హాస్టల్‌కి వెళ్లి విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ నాగేశం, కార్యదర్శి మాధవి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి సీనియర్ నాయకులు పుష్పనాదం, నెల్లూరు సుబ్రహ్మణ్యం, దేవళ్ళ రమణ, సూరిబాబు, నవాబు, కన్నన్‌రెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పులి దినోత్సవంపై అవగాహన కార్యక్రమం

తిరుపతి క్రీడ, జూలై 29 ప్రభాతవార్త:



అంతర్జాతీయ పులి దినోత్సవాన్ని పురస్కరించుకొని, తిరుపతిలోని ఎస్.వి. జూలోగికల్ పార్క్ బృందం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు పులుల సంరక్షణ అవసరంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వన్యప్రాణుల రక్షణ, పులుల జీవవైవిధ్యంపై ప్రభావం మరియు వాటి నివాస స్థలాలను కాపాడే అవసరం గురించి వివరించారు. ఈ కార్యక్రమం జూ పార్క్ విద్యా విభాగం చేపట్టిన వన్యప్రాణి సంరక్షణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించారు.

## బాలబాలికల జూడో ఎంపిక పోటీలు

తిరుపతి క్రీడ, జూలై 29 ప్రభాతవార్త:

జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు జూడో సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి తెలియ జేసారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు 31 తేదిన ఉదయం 9 గంటలకు జిల్లాలో ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ వయసు ధృవీకరణ పత్రం ఆధార్, బర్త్ సర్టిఫికేట్, స్కూల్ స్టడీ సర్టిఫికేట్, తీసుకురావాలన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులు వచ్చె నెల గుంటూరు జిల్లాలో 9, 10వ తేదిన జరిగే రాష్ట్ర స్థాయి జూడోలో పాల్గొంటారు. ఇతర వివరాల కోసం జిల్లా జూడో కోచ్ గోపి 9059606346 నెంబర్‌కు సంప్రదించాలని అధ్యక్షులు కృష్ణమూర్తి తెలిపారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం

రామచంద్రాపురం, జూలై 29 ప్రభాతవార్త :



మండలంలోని కుప్పం బాదూరు గ్రామంలో జరిగినటువంటి పొలం పిలుస్తోంది కార్యక్రమానికి పుత్తూరు డివిజన్ టెక్నికల్ ఏవో యామిని హాజరయ్యారు. లక్ష్మీ మాట్లాడుతూ ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత గల రైతులందరూ నమోదు కావడం పరిశీలించుకోవచ్చునని తెలిపారు. వరి వేసిన రైతులందరూ పంట బీమా పథకం క్రింద నమోదు చేసుకుని బీమా పథకాన్ని వినియోగించుకోవాలని, కౌలు రైతులందరూ కూడా గ్రామ వ్యవసాయ సహాయకులచే సీసీఆర్ సీకార్ట్స్ తీసుకోవాలని కోరారు. అనంతరం నడవలూరు గ్రామంలో వేరుశెనగ పంటను వేసిన రైతులతో చర్చించారు. అలాగే ఆర్‌సీపురంలో మండల వ్యవసాయ అధికారిగా పనిచేసినటువంటి లక్ష్మి మంగళవారం పుత్తూరు డివిజన్ ఏడీఏగా పదోన్నతి పొంది మండలానికి పర్యవేక్షణాధికారిగా విచ్చేసినందుకు గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రామచంద్రాపురం వ్యవసాయ అధికారి కార్యాలయంలో సిబ్బందికి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో నాగపంచమి వేడుకలు

రామచంద్రాపురం, జూలై 29 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో మంగళవారం నాగపంచమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగదేవతకు పంచామృత అభిషేకం గావించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశక్తి పీఠాదీశ్వరి మాతాజీ రమ్యానంద భారతి స్వామి వారాహి దేవి అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకం చేశారు. వారాహి అమ్మవారికి దివ్య పృథ్వీ సూక్తంతో జరిగిన ప్రత్యేక మృత్తికను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

## వైద్యచికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

చంద్రగిరి, జూలై 29 ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలతో వైద్య చికిత్సలు పొందుతున్న టిటిడి ఉద్యోగి జి.రాజశేఖర్ తుదిశ్వాస విడిచారు. ఈ నెల 23న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై చంద్రగిరికి వస్తున్న రాజశేఖర్ తొండవాడ సమీపంలోని సాయిబాబ ఆలయం వద్ద అదుపు తప్పి క్రిందపడిపోయాడు. స్థానికులు 108 ద్వారా తిరుపతి రుయా కు పంపించారు. కుటుంబ సభ్యులు రుయా ఆసుపత్రి నుండి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు. స్విమ్స్‌లో వైద్య చికిత్సలు పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు హేమంత్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్థిక మోసాలపై చర్యలకు ఎస్ ఈబిఐ శ్రీకారం

తిరుపతి విద్య, జూలై 29 ప్రభాతవార్త :

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ ఈబిఐ) దేశవ్యాప్తంగా పెట్టుబడిదారుల అవగాహన పెంచేందుకు సెబీ వర్స్ స్కాం ప్రచారాన్ని ప్రారంభించిందని ఆ సంస్థ పిఆర్ఓ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రచారం ద్వారా రకరకాల ఆర్థిక మోసాల గురించి సమాచారం ఇవ్వడం,అలాంటి మోసాల నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలో పెట్టుబడిదారులకు తెలియజేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. ఏదైనా మోసపూరిత కార్యకలాపాలను మీరు డబ్ల్యూ. సైబర్ క్రైమ్.గవర్నమెంట్.ఇన్ వద్ద నివేదించవచ్చు, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నెంబర్‌కు కాల్ చేయవచ్చు. పెట్టుబడిదారుల మద్దతు కోసం, ఎన్ ఎస్ ఈని 1800 266 0050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## కుంబాభిషేకం జరిపించండి

శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున తాము అధికంరలో ఉన్నపుడు లక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని నిర్మించామని ఆ ఆలయానికి ఇప్పటి వరకు కుంబాభిషేకం జరపలేదని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం ద్వజమెత్తారు. భక్తకన్నప్ప కొండపైకి వెళ్ళె దారిలో మరుగున పడిన ఆలయాన్ని జీర్ణోద్ధారణ గావించామన్నారు. ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి, దుర్గాదేవి, శివసుబ్రమణ్యం, గణపతి ఆలయాలకు బాలాలయాన్ని జరిపామన్నారు. వాటిలో శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం మాత్రం దాతల సహాకారంతో పూర్తి చేసినట్లు శ్రీనివాసులు వివరించారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినోత్సవం

శ్రీకాళహస్తిరూరల్ జూలై 29 ప్రభాతవార్త:



ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పాపానాయుడుపేట జూనియర్ కళాశాల నందు ఘనంగా మంగళవారం మానవ అక్రమరవాణా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కో ఆర్డినేటర్ సుభాష్ మాట్లాడుతూ బాలబాలికలు ఎదుర్కొంటున్నఅక్రమ రవాణా గురించి అక్రమ రవాణా చేసి వారి అవయవాలను వారికి తెలియకుండా తీసుకోవడంపై అవగాహన కల్పించారు.ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ హ్యూమన్ ట్రాఫిక్ అనేది జరగడం వలన రకారకాల పనుల చేయుటకు అవయవాల దోపిడి జరుగుతుందని అని అందరు జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మంజూష,ప్రగతి సంస్థ కార్యకర్త సుమలత,రాజేశ్వరి హాజరైయ్యారు.

## కార్యకర్తలందరూ ఐక్యతగా పనిచేయండి : ఎమ్మెల్యే



**కార్వేటినగరం,జూలై 29 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఐక్యతగా ఏర్పడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జి.డి.నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే థామస్ పిలుపునిచ్చారు.కార్వేటినగరం మండలంలోని కొటార్వేడులో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమానికి ముందు కార్వేటినగరంలోని శ్రీబంగారమ్మ ఆలయ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్‌ను కలసి వారి నివాసంలో కొంతసేపు చర్చలు జరిపారు. అనంతరం తొలిఅడుగు కార్యక్రమానికి వెలుతూ మార్గమధ్యలో తెలుగుదేశంపార్టీ కార్యకర్త అకస్మిక మృతి చెందారని తెలుసుకున్న థామస్ తన వాహనాన్ని నిలిపి కార్యకర్త పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు మండలంలోని ఆర్‌కెవిబిపేట దేశంపార్టీ సీనియర్ నాయకులు నాగభూషణరెడ్డి పరామర్శించి ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రమౌళి,కార్యకర్తలు మాజీ వైస్ ఎంపిపీ రవికుమార్ హేమంత్‌రెడ్డి, చెంగల్‌రాయల్ యాదవ్, రాజేంద్రరెడ్డి, ఈశ్వర్, రాజశేఖర్, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇద్దరు ఐసిడియస్ అధికారులకు సన్మానం



**కార్వేటినగరం,జూలై 29 ప్రభాతవార్త:** ఐసిడియస్ కార్యాలయంలో మంగళవారం ఇద్దరు ఐసిడియస్ అధికారులను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్వేటినగరంలో గత కొన్నిఏళ్ళుగా ఐసిడియస్ అధికారిగా విధులు నిర్వర్తించి గంగాధర నెల్లూరుకు బదిలీపై వెళ్ళిన పద్మసునందకు వీడ్కోలు పలుకుతూ, పిచ్చాటూరు నుంచి కార్వేటినగరానికి బదిలీపై వచ్చిన శోభారాణిని ఆహ్వానిస్తూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మమత, సుగుణ, కృష్ణవేణి, రాణి, స్వర్ణ,మంజుల,వసంత,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య పరీక్షలు




**తిరుపతి విద్య,జూలై 29 ప్రభాతవార్త:** ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల ఆలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెరికన్ ఐ హాస్పిటల్ తిరుపతి వారి సౌజన్యంతో కళాశాలలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.పరమేశ్వర తెలిపారు. ఉచిత కంటి పరీక్షల కార్యక్రమంలో భాగంగా అక్కడికి విచ్చేసిన డాక్టర్లు కళాశాలలోని అధ్యాపక బృందం, విద్యా ర్థిని విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డా.కే.విజ యకుమార్, డా.కే.కోటేశ్వరయ్య, డా.ఎన్. జగదీష్ కుమార్, డా.ఎం.మాదన్న, డా.పి.శివకుమార్, బి.సులోచనరాణి, డా.కే.వెంకటేష్, డా.టి.ఎల్.నరసింహారెడ్డి,డా.ఎం.వాసుదేవా రెడ్డి,కే.భాస్కరన్, పి. హరీష్‌రెడ్డి తదితర అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రెక్టార్ పదవిని దళితలకు కేటాయించండి



**తిరుపతి విద్య, జూలై 29 ప్రభాతవార్త:** ఎస్వీ వర్సిటీలో దాదాపుగా చాలా సంవత్సరాలుగా రెక్టార్ పదవి భర్తీ చేయకుండా పదవుల్లో సమతుల్యత లేకుండా ఎస్వీ యూనివర్సిటీ ముందుకెళ్తుందని ఎ పి స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రియాదవ్ మంగళవారం వర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సెలర్ ఆచార్య అప్పారావుని, రిజిస్ట్రర్ భూపతి నాయుడుని కలసి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుధాకర్ మాదిగ, జెడి ప్రసాద్, తిరుమలేష్ ప్రభు,నరేష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రమజీవుల సంబరాల్లో శత జయంతి ఉత్సవాలు : సీపీఐ



**పుత్తూరు రూరల్, జూలై 29 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ చంద్రగిరి మండల 11వ మహాసభ డి.మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టుపార్టీ స్వాతంత్ర్య పోరాటంలో సంపూర్ణ స్వాతంత్ర్యంకై నినాదించి పోరాడిందని, దున్నే వాడికి భూమి కావాలని ఇల్లు లేని పేదలందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని అనేక భూ పోరాటాలు చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపుతోందని, స్మార్ట్ మీటర్లను బిగించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఆయాలు, స్వీపర్ల పరిస్థితి మరి దారుణంగా ఉందన్నారు.వీటన్నిటికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టుపార్టీ రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రాధాకృష్ణ, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గోపి, మని, శరవణ, విజయ్, సెల్వరాజా, చారి, రమేష్, లావణ్య, ధనలక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

## వరిలో సమగ్ర సత్సరక్షణ చర్యలు పాటించండి



**పుత్తూరు రూరల్, జూలై 29 ప్రభాతవార్త:** పుత్తూరు మండలం అమరం కండ్రిగ గ్రామంలో పీఎం ఆర్‌కేవీవై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం(తిరుపతి) వారిచే రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు పాల్గొని మాట్లాడుతూ అధికంగా పురుగు మందులు, కలుపు మందులు వాడకం, వాతావరణంకు భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యంకు హాని కలిగిస్తుందన్నారు. అనంతరం పుత్తూరు డివిజన్ ఏడీఏ లక్ష్మిదేవి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను రైతులు తప్పని సరిగా పంటలకు వాడుకోవాలని తెలియజేశారు. పుత్తూరు మండల వ్యవసాయాధికారి కోదండయ్య మాట్లాడుతూ పంటల బీమా పథకం గురించి వివరిస్తూ సద్ద పంటకు పంటల బీమా ప్రీమియం ఎకరాకు రూ.64లు వారికి రూ.168లు అని తెలిపారు.అమరం కండ్రిగ గ్రామ వ్యవసా య సహాయకురాలు ప్రియాంక, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో రవిచంద్ర, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యలో సంస్కరణలపైఅవగాహన సదస్సు



**తిరుపతి విద్య, జూలై 29 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ విద్యలో 2025-26 విద్యా సంవత్సరం కొత్తగా తీసుకువచ్చిన సంస్కరణలపై తిరుపతి జిల్లాలోని అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాల్ లకు తిరుపతి ఎస్.వి. జూనియర్ కళాశాల నందు ఆర్ ఐ ఓ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సిలబస్ మార్పు,సబ్జెక్టు కలయిక (కాంబినేషన్), ప్రశ్నాపత్రంలో మార్పులను వివరించారు. పోటీ పరీక్షలైనా ఈఎపి సెట్‌నీట్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడంపై కూడా అవగాహన కల్పించడం జరిగింది. 202627 విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో మార్పులు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు నూతన సంస్కరణలపై ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్ లను సంప్రదించాలని కోరారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి : బొజ్జల రిషితా రెడ్డి



**రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త :** శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని అమ్మవారి కరుణ కటాక్షాలుతో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండేలా అనుగ్రహించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అమ్మవారికి మొక్కుకున్నారు. శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ జాతర సందర్భంగా బొజ్జల రిషితారెడ్డి మంగళవారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమెకు ధర్మకర్తలు ఏలుమలై రెడ్డి, సరసమ్మ, తులసి రెడ్డి ఆమెకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పార్టీ సీనియర్ నేతలు డి పుష్పనాదం, కొరియర్ రవి, నెల్లూరు సుబ్రమణ్యం, దేవళ్ళ రమణ తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే



కోట, జులై 29 ప్రభాతవార్త: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెప్పారు. మంగళవారం కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై వివరించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో భాగంగా పింఛన్ల పెంపుదల, తల్లికి వందనం పథకం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ వంటివి అమలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : ఎమ్మెల్యే



కోట, జులై 29 ప్రభాతవార్త : విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం కోట మండలం చిట్టేడులోని గిరిజన గురుకుల పాఠశాలలో పిఎంశ్రీ ల్యాబ్‌ను, ఆటస్థలం, వంటగదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఒక ప్రణాళిక ప్రకారం విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కుమార్, ఎపిఒ శివశంకర్, డిపిఎం సురేష్, ఎంఇఒ మస్తానయ్య, ఎంపిడిఒ వేణు, మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, ప్రిన్సిపాల్ శుభకర్‌రావులు పాల్గొన్నారు.

## దీపం.. సాంకేతిక శాపం

కోట, జులై 29 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్‌సిక్స్ అమలులో భాగంగా మహాశక్తి పథకం కింద ప్రతి ఇంటికి ఏడాదికి మూడు చొప్పున ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా గత ఏడాది నవంబర్ 1న దీపం–2 పథకానికి శ్రీకారంచుట్టింది. నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున తొలిఏడాదిగా ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు మొదటి సిలిండర్ పొందారు. రెండో సిలిండర్‌ను ఈ నెలాఖరులోగా బుక్ చేసుకుంటే రాయితీ పొందే అవకాశం ఉంది. మరోపక్క సాంకేతిక సమస్యలు, వివరాలు నమోదులో తప్పిదాలతో కొందరు లబ్ధిదారులకు రాయితీ జమ కావడం లేదు. లబ్ధిదారులకు రెండు మూడు బ్యాంకు ఖాతాలు ఉండటం, ఆధార్ అనుసంధానం కాకపోవడం, గ్యాస్ కనెక్షన్‌తో లబ్ధిదారుని ఈకేవైసీ పూర్తి కాకపోవడం తదితర కారణాలతో నగదు జమ కావడం లేదు. లబ్ధిదారులు తమకు ఉచిత గ్యాస్ పథకం అమలు కావడంలేదని ఆరోపిస్తున్నారు.

## గోపాల్‌రెడ్డిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు



సూళ్లూరుపేట, జులై 29 ప్రభాతవార్త: మండలం లోని గోపాల్‌రెడ్డిపాలెం గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళ వారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పర్వతరెడ్డి చంద్రారెడ్డి, మురళీరెడ్డి, కోటయ్య, రమణయ్య, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కంటి సంరక్షణపై శ్రద్ధ చూపాలి



బాలాయపల్లి, జూలై 29 ప్రభాతవార్త: మండలం జయంపు గ్రామ సచివాలయంలో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్, లలితమ్మ కంటి వెలుగు, శ్రీ వెంకటేశ్వర అరవింద ఐ హాస్పిటల్ తిరుపతి వారి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర అరవింద ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యపరికరాలు, టెక్నాలజీలో శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తామని డాక్టర్ మేఘన తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించి ట్రస్ట్ వారి వాహనంలోనే చికిత్స అనంతరం ఇంటి వద్దకే చేరుస్తామని తెలిపారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ క్యాంపులో ట్రస్ట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఫోటో

## ప్రభుత్వ భూముల ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలి



వెంకటగిరి, జూలై 29 ప్రభాతవార్త : వెంకటగిరి ప్రాంతంలో ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు గురవుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు టిటి మణి ఫిర్యాదు చేశారు. తిరుపతిలో కలెక్టర్ కార్యాలయంలో బిజెపి నాయకులు కలెక్టర్లను కలిసి వినత పత్రం అందజేశారు. బఫర్ జోన్‌లో కూడా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఆక్రమాణాలపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బిజెపి నాయకులు గోపాల్ నాయుడు, శ్రావణ్ కుమార్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

## రూ.2 లక్షల వ్యయంతో మోక్షధామం సుందరీకరణ



గూడూరు, జూలై 29 ప్రభాతవార్త: గూడూరు రెండవ పట్టణంలోని రోటరీ మోక్షధామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్త సేవా సమితి అధ్యక్షులు సి.అశోక్ కుమార్ దాతృత్వంతో సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో మోక్షధామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మోక్షధామం అభివృద్ధికై సహకారాన్ని అందించిన సంయుక్త సేవాసమితికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సమితి అధ్యక్షులు సి.అశోక్ కుమార్ ను రోటరీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మల్లు విజయ్ కుమార్ రెడ్డి, మోక్షధామం చైర్మన్ కిరణ్ చక్రవర్తి, సీనియర్ రొటేరెన్స్ బి.దశరథరామిరెడ్డి, హనుమంతరావు, పీవీ కృష్ణయ్య, రవీంద్రారెడ్డి, ఎన్. బాలకృష్ణంరాజు,టి సురేష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రాంప్రసాద్, జి జినాయుడు, జనార్దన్‌రెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ గ్రాడ్యుయేషన్‌లో గూడూరు వాసి పట్టా



గూడూరు, జూలై 29 ప్రభాతవార్త: ఏఐ (కృత్రిమ మేధ)పై 60 రోజులు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాంలో గూడూరుకి చెందిన సుధా చంద్రమౌళి టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ టి హబ్‌లో జరిగిన పట్టాలు ప్రదానోత్సవంలో ఏఐ పట్టా అందుకున్నట్లు సుధా చంద్రమౌళి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సుధా చంద్రమౌళి మాట్లాడుతూ ఏఐ ఎక్స్ పర్ట్ సర్టిఫికెట్ అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఏఐ టెక్నాలజీ చిన్నప్పటి నుంచి నేర్చుకోవాలని, భవిష్యత్తుకి బాటలు వేసుకోవాలని కోరారు. త్వరలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఏఐ తరగతులు జరిగేలా కృషి చేస్తామనన్నారు.

# గూడూరు డివిజన్

## ఖాళీగా ఉన్న ప్లాట్లను పేదలకు ఇవ్వాలి



వెంకటగిరి, జూలై 29 ప్రభాతవార్త : పట్టణంలోని జగనన్న లేఔట్ లో ఖాళీగా ఉన్న ప్లాట్‌లను పేదలకు ఇవ్వాలని ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. ఇల్లు లేని అనేకమంది పేదలు ఉన్నారని తెలిపారు. జగనన్న లేఔట్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్లు వివరాలను తెలియజేయాలని హౌసింగ్ అధికారులను సమాచార చట్టం ద్వారా కోరినట్లు తెలిపారు. సమస్యలపై వినతిపత్రాలు పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీతలకు సన్మానం



గూడూరు, జూలై 29 ప్రభాతవార్త: వివిధ రంగాల్లో తమ ప్రత్యేకమైన పరిశోధనల ద్వారా డాక్టరేట్ పట్టా పొందిన అధ్యాపకులను ఆదిశంకర డీమ్డ్ టూ బి యూనివర్సిటీలో ఛాన్సలర్ వంకీ పెంచలయ్య చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ చీపినేటి సురేష్, వరదగల జగదీష్, జడ్డా అమరేంద్రలు యూనివర్సిటీలో పనిచేస్తూ, వివిధ అంశాల్లో పరిశోధనలు చేసి డాక్టరేట్‌ను పొందారు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ జనార్ధన్‌రెడ్డి సేవలు మరువలేనివి



గూడూరు, జూలై 29 ప్రభాతవార్త: కామ్రేడ్ ఇందుకూరు జనార్దన్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం నాయకులు కొనియాడారు. గూడూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జనార్దన్ రెడ్డి వర్ధంతి వేడుకలు జోగి శివకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివ కుమార్, రామిరెడ్డి, గుర్రం రమణయ్య, ఆర్. శ్రీనివాసులు, గంటా వెంకటేశ్వర్లు, ఎస్.ముత్యాలయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, చంద్రమోహన్, బి.చంద్రయ్య, పుట్టా శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో విచ్చలవిడిగా అనధికార మద్యం షాపులు!

నాయుడుపేట,జూలై 29 ప్రభాతవార్త ; నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు, చిలమత్తూరు, కాపులూరు,పూడేరు, ద్వారకాపురం, మేనకూరు, అన్నమేడు,తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా అనధికార మద్యం షాపులు నిర్వహిస్తున్న సంబంధిత ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామీణ మహిళలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్మూలించాలన్న దృఢసంకల్పంతో పనిచేస్తుంటే నాయుడుపేట మండలంలో పనిచేస్తున్న ఎక్సైజ్ అధికారుల పనితీరు అందుకు భిన్నంగా ఉందన్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులకు పలు దఫాలుగా ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో అనధికార మద్యం షాపులు నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహిళలు కోరుతున్నారు.

## నిమ్మ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు సేవలు



వెంకటగిరి, జూలై 29 ప్రభాతవార్త : నిమ్మ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు విరివిగా సేవలందించాలని ఏడీఆర్ సిహెచ్ రూతు తెలిపారు. పెట్లూరులోని నిమ్మచెని పరిశోధన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అధునాతన పద్ధతిలో సాగు చేసే విధానం తెలిపారు. పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సాధించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. నిమ్మ పరిశోధనలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఆమె వెంట పరిశోధన స్థానం హెడ్ శ్యాంసుందర్ రెడ్డి, శాస్త్రవేత్తలు ఎం రామయ్య, కవిత, ఏఈఓస్ సుధాకర్ శెట్టి,రామకృష్ణ, మోహన్ ముని చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ మహదేవ్‌లో పాల్గొన్న సైనికులకు సెల్యూట్ : దయాకర్



వెంకటగిరి, జూలై 29 ప్రభాతవార్త: జమ్మూ కాశ్మీర్‌లో ఏప్రిల్ 22న పెహల్గాంలో పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఇదివరకే ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్తాన్ పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. సోమవారం పెహల్గామ్‌లో పర్యాటకులను చంపిన ఉగ్రవాదుల్లో ముఖ్య సూత్రధారి అయిన సులేమాన్ షాను భారత్ సైన్యం ఆపరేషన్ మహదేవ్ శ్రీనగర్ సమీపంలోని భద్రతా బలగాలు అప్రమత్తమై హత మార్చారు. మహదేవ్ వద్ద ఉగ్రవాదుల హతమార్పిడిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ ప్రాంతంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కె. దయాకర్ ఆధ్వర్యంలో ఆపరేషన్ మహదేవ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ నాయుడు, మహిళా నాయకురాలు బిందు రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎం.రవీంద్ర, బాలకృష్ణ గౌడ్, కోశాధికారి నిరంజన్, పట్టణ ఉపాధ్యక్షులు ఐ సురేష్ బాబు, గుమ్మడి శ్రీనివాసులు, బల్లి ప్రభాకర్, ఓబీసీ మోర్చా నాయకులు కటికాల సురేష్ బాబు, యువ మోర్చా నాయకులు శివకుమార్, మధిర సునీల్ కుమార్, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్ జిల్లాల దొంగ అరెస్టు: రూ.27లక్షల బంగారు స్వాధీనం



శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పోలీసులు అంతర్‌జిల్లాల దొంగను అరెస్టు చేసి రూ.27లక్షల విలువ చేసే బంగారును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ అంతర్‌జిల్లా దొంగను పట్టుకోవటంలో ఎంతో చాకచక్యంగా వ్యవహారించారన్నారు. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విహారయాత్రలకు, టెంపుల్స్‌కు వెళుతు న్నపుడు బయటకు వెళుతున్నపుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇళ్ళకు హెచ్‌ఎంఎస్ కెమెరాలు అమర్చి ఇంటికి పోలీసులు రక్షణగా ఉంటామని ఎస్‌పి వివరించారు.మా బ్లూకోడ్స్ టీంతో దొంగలను పట్టుకోవటం జరుగుతుందన్నారు.శ్రీకాళహస్తి పోలీసుల చొరవను ఎస్‌పి అభినందించారు. తిరుపతి జిల్లాలోని పలు ఇళ్ళలో చోరీలకు పాల్పడిన ముద్దాయిని పట్టుకొని ఆతని వద్ద నుంచి రూ.27లక్షల విలువ గల్గిన 248.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మూడు మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.నెల్లూరుకు చెందిన మీధూరి సునీల్(29)ను అరెస్టు చేసినట్లు వివరించారు.నిందితుడు ఒకటవ,రెండవ, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, నాయుడుపేట మరియుగూడూరు పోలీసు స్టేషన్ పరిధిలో 9 ఇళ్ళలో చోరీలకు పాల్పడినట్లు వివరించారు. ఈ నిందితుని నెల్లూరు వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీ పెన్నానది బ్రిడ్జి వద్ద అరెస్టు చేసినట్లు వివరించారు.సునీల్‌పై గతంలో శ్రీకాళహస్తిటౌన్, నెల్లూరు టౌన్, నెల్లూరు రూరల్, నవాబ్‌పేట, కావలి, కొడవలూరు, రేణిగుంట, కడప, బద్వేల్, ఖాజీపేట, ఇందుకూరుపేట, నాయుడుపేట, బుచ్చిరెడ్డి పాళెం, నెల్లూరు బాలాజి కాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో సుమారు 28కేసులు ఉన్నాయని జైలులో శిక్షకూడా అనుభవించినట్లు వివరించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, నాయుడుపేట,గూడూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఎస్‌పి వివరించారు.ఈ కేసును ఛేదించటంలో సిఐ గోపితో ఆయన సిబ్బంది సహకరించారని ఎస్‌పి వివరించారు.

## సంక్షేమానికి కట్టుబడి పరిపాలన సాగిస్తున్నాం : ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తిరూరల్,జూలై 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో అన్నారు.మంగళవారం తొలిఅడుగు కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాళహస్తికి సమీపంలోని పుల్లారెడ్డి కండ్రిలో సమావేశం ఏర్పాటు చేసారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ స్వర్ణముఖి నదీ తీరాన వెలసిన గ్రామాల్లో వ్యవసాయం ఓ వరంగా ఉందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వంతో పాటు స్థానికంగా పలుసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. మేలైన వంగడాలతో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కాగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజలు ప్రభుత్వం నుంచి ఏమి కోరుకుంటున్నారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమాల్లో మండలాధ్యక్షుడు అంక్షితల కృష్ణయ్య యాదవ్, తాటిపర్తి రవీంద్రరెడ్డి కామేష్‌యాదవ్,బత్తిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, కందాటి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

**ఏర్పేడు మండలంలో :**

ఏర్పేడు మండలంలోనిరాజులకండ్రిగ మడిబాకలలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు సారథ్యంలో సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణముఖి తీరాన వెలసిన గ్రామాల్లో రైతులు బంగారు పండిస్తున్నారని వివరించారు. రైతులకు సాగునీటి సదుపాయం కల్పించటమే శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. రెడ్డివారి గురువారెడ్డి, పేరం ధనంజయులునాయుడు, పొన్నారావు, మల్లికార్జున్ నాయుడు, శివశంకర్‌రెడ్డి, మోహన్‌నాయుడు, సూరినాయుడు, శ్రీనివాసులునాయుడు, శ్రీనివాసులు రాజు, చెంగల్‌రాజు,పట్టాభి,బుల్లిరాజు,మాధవరాజు వరదరాజు,చిరంజీవులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు జర జాగ్రత్త : డీఎస్పీ



రేణిగుంట జూలై 29 ప్రభాతవార్త: చదువుకునే పిల్లలు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు. రేణిగుంట మండలం ఆర్.మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగళ వారం విద్యార్థులకు పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకదవ్యాల వినియోగాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్, బాల్యవివాహాలు తదితర అనేక అంశాలపై డీఎస్పీ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది పిల్లలు యువకులు మొబైల్ ఫోన్ల మాయాజాలంలో పడి తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. కొంతమంది మానసిక రోగులుగా, మరి కొంతమంది గుడ్డి వారిగా మిగిలిపోయారన్నారు. మొబైల్ ఫోన్లను కేవలం మంచికి ఉపయోగించు కోవాలని మొబైల్ ఫోన్ల ద్వారా బెట్టింగ్ యాప్లు డౌన్లోడ్ చేసుకొని అప్పులు పాలు కావద్దని హెచ్చరించారు. రోడ్లు దాటేటప్పుడు జాగ్రత్తగా రెండు వైపులా చూసుకొని దాటాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. వాహనాలు నడపాలంటే తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎవరు అడిగినా ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు నంబర్లు తెలపకూడదన్నారు. అనుమానం వస్తే వెంటనే దగ్గర్లోని పోలీస్ స్టేషన్కు ఫోన్ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ నంబర్ తెలియనప్పుడు 100,112, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, పిఎస్‌ఐ స్వాతి, జిఎంఎస్కె యమునా, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, పోలీస్ సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

## సిఐని సత్కరిస్తున్న ఎస్‌పి



శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి టౌన్ సిఐ డి.గోపిని మంగళవారం జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సత్కరించారు. ఓ ప్రతిష్టాత్మకమైన కేసు ఛేదనలో సిఐ గోపి చూపిన చొరవ ప్రశంసనీయం అని ఎస్‌పి అన్నారు. తిరుపతి, నెల్లూరుజిల్లాలో పలు కేసులకు సబంధించిన నేరస్థుణ్ని చాక చక్యంగా పట్టుకోవటమే కాకుండా ఆతనినుంచి సుమారు రూ.27లక్షలు నగలను స్వాధీనం చేసుకోవటంలో ఆతను పడిన శ్రమ అభినందనీయం అన్నారు. విధి నిర్వహణలో ఎప్పుడూ జవాబుదారి తనంతో వ్యవహారించే సిఐ గోపి తన సహచరులతో కలసి నేరాలను అరికట్టుడంలో చొరవ చూపారని ఎస్‌పి గోపిని అభినందించారు.ఇదే చొరవ జవాబుదారి తనం అలవాటు చేసుకోవాలని ఎస్‌పి గోపికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు డి.గోపిని సత్కరించారు. రివార్డును అందించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి పాల్గొన్నారు. సిఐతో పాటు తొట్టంబేడు ఎస్ ఐ రామాంజనేయులు,కానిస్టేబుల్స్ సిబ్బంది జే.హేమాద్రి, శంకరయ్య, జి.అరుణ్‌కుమార్, కె.భరత్, బాబు, కె.బాలకృష్ణ, గంగాధర్,చటర్జీలను అభినందించి రివార్డులను అందించారు.

## గరుడునిపై గరుడాద్రివాసుడు



తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి: శ్రావణమాసంలో గరుడ పంచమిరోజు మంగళవారం సాయంత్రం మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. మలయప్ప కర్పూర అర్చకులు హారతులిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడ వాహనం మాఢవీధుల్లో ఊరేగింది. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్‌ఓలు ఎస్టీవి రామ్‌కుమార్, అల్లం సురేంద్ర, భక్తులు పాల్గొన్నారు.

## బంగారు దేవుడికి...బంగారు శంఖుచక్రాలు



తిరుమల.జూలై 29ప్రభాతవార్తప్రతినిధి: బంగారు దేవునికి ఓ దాత భక్తుడు 2.40కోట్ల రూపాయలు విలువైన బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చాడు. సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు శంఖు, చక్రాలను విరాళాలను టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి మంగళవారం అందించారు.

## సీపీఆర్ ప్రాముఖ్యతపై డాక్టర్ సిపాయి అవగాహన

తిరుపతి హెల్త్, జూలై 29 ప్రభాతవార్త : సీపీఆర్ ప్రాముఖ్యతపై మంగళవారం ఎమ్మెల్సీ, రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వివరించారు. జేసీస్ తిరుపతి అల్యూమ్ని క్లబ్, శ్వాస సంయుక్తంగా నిర్వహిస్తున్న సీపీఆర్ ట్రైనింగ్ కార్యక్రమం మంగళవారం రష్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరై సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. హార్ట్ అటాక్‌తో మనిషి కుప్పకూలి క్రింద పడినపుడు వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా మనిషి ప్రాణాన్ని కాపాడవచ్చునన్నారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ జి. శంకర్, డాక్టర్ చందన్ కుమార్, డాక్టర్ గౌరి, డాక్టర్ బాబు, రాజశ్రీ, సుప్రజ, రష్ ఆస్పత్రి సిబ్బంది, జేసీ జేపీసీ మిత్రులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర టువీలర్ దొంగలు అరెస్ట్ : డిఎస్పీ

**- 10లక్షల విలువ చేసే 18 వాహనాలు స్వాధీనం !!**



గుడుపల్లె, జూలై 29 ప్రభాతవార్త: ద్విచక్ర వాహనా లను చోరీ చేసే అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో తనతో పాటు సిఐలు మల్లేష్ యాదవ్, శంకరయ్య, ఎస్సైలు శ్రీనివాసులు, వెంకటమోహన్‌లు సిబ్బందితో కలసి సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న టువీలర్ల చోరీలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు. మంగళవారం పిఇఎస్ మెడికల్ కాలేజ్ వద్ద ఆరుమంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ అయిన వారిలో అరుణ్‌కుమార్, హరి, మోహన్, మణిగండన్, ముఖేష్, దినేష్‌లు ఉన్నారన్నారు. వీరిలో అరుణ్‌కుమార్ గతంలో తమిళనాడులో సైత ం టువీలర్ చోరీలకు పాల్పడి జైలుకెళ్లి వచ్చాడన్నారు. ఇతను తన స్నేహితులైన హరి, మోహన్, మణిగండన్, ముఖేష్, దినేష్‌లు మృందంగా ఏర్పడి జల్సాలకు అలవాటు పడి గత నాలుగు నెలలుగా కుప్పం ప్రాంతాల్లో టువీలర్లు దొంగిలించి వాటిని మోహన్ సాయంతో అతని అత్తగారిల్లు అయిన కదిరిగోపనపల్లి గ్రామంలో ఓషెడ్డులో దాచి ఉంచారన్నారు. మొత్తం 18 టువీలర్లను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ పది లక్షలు ఉంటుందన్నారు. ఈసందర్భంగా కేసును ఛేధించిన పోలీసు అధికారుల బృందాన్ని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

## భర్త ఆత్మహత్య కేసులో భార్య..ప్రియుడు అరెస్ట్



కుప్పం, జూలై29 ప్రభాతవార్త : మండలంలోని మిట్టపల్లి గ్రామంలో భార్య అక్రమ సంబంధంవ విషయాన్ని జీర్ణించుకోలేక జీవితంపై విరక్తి చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో భార్య, ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ రెండో ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన మేరకు వివరాలిలా.. మిట్టపల్లికి చెందిన కుపేంద్ర, భార్గవి భార్యభర్తలు అన్నారు. కాగా భార్గవి అదే గ్రామంకు చెందిన షేక్ మునీర్‌తో అక్రమ సంబంధం కలిగి ఉందనే విషయం తెలుసుకున్న కుపేంద్ర గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేయగా వారిద్దరినీ మందలించారన్నారు. భార్గవి, షేక్‌మునీర్‌లో ఎలాంటి మార్పు రాకపోగా ఇద్దరూ కలసి కుపేంద్రను నువ్వు బతికి ఉండడం కంటే చస్తేనే బాగు ంటుందని ఇద్దరూ పేర్కొనడంతో తీవ్ర మనస్తాపంకు గురైన కుపేంద్ర ఈనెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో భార్గవి, షేక్‌మునీర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## స్కిట్ పునఃప్రారంభంపై హర్షం



తొట్టంబేడు,జూలై 29 ప్రభాతవార్త : స్కిట్ పునఃప్రారంభంపై తొట్టంబేడు మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు హర్షం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రారంభించిన ఇంజనీరింగ్ కాలేజీ గత కొన్ని సంవత్సరాలుగా మూడపడపోయింది. గతంలో అనేక మంది రాజకీయ నాయకులు దీనిని ప్రారంభిస్తామని, చివరి అమ్మకానికి పెట్టేశారని, అలాంటి పరిస్థితి నుండి నేడు పూర్వవైభం సంతరించు కోనున్నదని ఆయన అన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన స్కిట్ కళాశాలను ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిల కృషితో నేడు ఊపిరిపోసుకోనున్నదన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.